క్లుప్తంగా

నేడు నక్కబొక్కలపాడులో గడప గడపకు..

బల్లికురవ: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో మంగళవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ముఖ్య అతిథిగా హాజరైయ్యే కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

జులై 1 నుంచి గ్రామసభలు

కారంచేడు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జులై 1వ తేదీ నుంచి మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ఎంపీడీవో డీ విజయలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో విలేకర్లతో మాట్లాడారు. ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దారు ఒక టీంగాను, తహసీల్దారు, ఈఓ పీఆర్డీ ఒక టీంగాను ఉండి మండలంలోని అన్ని గ్రామాల్లో అవగాహన సభలు నిర్వహిస్తామన్నారు. జులై 1న ఆదిపూడి, తిమిడెదపాడు గ్రామాల్లో, 7వ తేదీన స్వర్ణ-1, కుంకలమర్రు-1 సచివాలయాల్లో, 10న స్వర్ణ-2, కుంకలమర్రు-2 సచివాలయాల్లో, 15వ తేదీన దగ్గుబాడు, కారంచేడు-1లోను, 20వ తేదీన జరుబులవారిపాలెం, కారంచేడు-2 సచివాలయాల్లో, 26న కొడవలివారిపాలెం, కారంచేడు-2 గ్రామ సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహించాల్సి ఉందన్నారు. అన్ని గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాల్సి ఉందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

అద్దంకి రూరల్: కుటుంబ కలహాల కారణంగా విషం తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు.. శింగరకొండకు చెందిన పెందేటి దుర్గాప్రసాద్ (20) కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి కొంగలకు చంపేందుకు వాడే విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒంగోలు వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భార్య మరియమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రవీణ కేసు నమోదు చేశారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

మేదరమెట్ల: దేవాలయ పునర్ నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి వినతి పత్రం అందించారు. సోమవారం తిరుమలలో సుబ్బారెడ్డిని అనమనమూరు సర్పంచ్ హరిబాబు, గ్రామస్తులు కలిసి విన్నవించారు. గ్రామంలో వేంచిసిఉన్న అంకమ్మ తల్లి దేవాలయ పునర్‌నిర్మాణానికి గతంలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ. 24 లక్షలు మంజూరు చేశారని అయితే ఆ నిధులు సరిపోనందున రెండోసారి మంజూరు చేసిన రూ.10 లక్షలను విడుదల చేయాలని వారు కోరారు.

కలుషిత ఆహారంతో గేదె మృతి

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని ఇంకొల్లు స్టాలిన్ పేటకు చెందిన పశుపోషకుడు తమ్మలూరి మహేష్‌కు చెందిన గేదె కలుషిత ఆహారం తీసుకొని సోమవారం హఠాత్తుగా మృతి చెందింది. బాధితుడు సమాచారం ప్రకారం తమ గేదె ఆదివారం రోజులాగే పొలంలో మేత మేసేందుకు వెళ్లింది. యథావిధిగా ఇంటికి వచ్చిన గేదె పాలను సైతం ఇచ్చింది. అయితే సోమవారం తెల్లవారేసరికి హుషారు లేకుండా నీరసంగా కన్పించింది. దాంతో స్థానిక పశువైద్యులు పిలిచి చూపించగా మందులు వాడినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గతంలో తనకు చెందిన విద్యుత్ షాక్‌తో మృతి చెందగా ప్రస్తుతం సుమారు రూ 80 వేలు విలువ కలిగిన గేదె అకస్మాత్తుగా మృతి చెందిందని, కుటుంబానికి ఆధారంగా ఉన్న గేదె చనిపోవడంతో తనకు తీవ్ర నష్టం జరిగిందని వాపోయాడు.

నేడు పెద్దివారిపాలెంలో గడప గడపకు..

పర్చూరు (చినగంజాం): మండలంలోని కొల్లావారిపాలెం, పెద్దివారిపాలెం గ్రామ సచివాలయ పరిధిలో 20వ తేదీ మంగళ వారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పర్చూరు కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ హాజరు కానున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధుఐలు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉపకార వేతనాలకు ఎంపిక

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీకి చెందిన 32 మంది విద్యార్థులు జాతీయ స్థాయి ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణరావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. బీటెక్ మొదటి చదువుతున్న 18 మంది, డిప్లొమో ఫస్టియర్‌లో 24 మంది ఏఐసీటీయూ ప్రగతి స్కాలర్‌షిప్స్‌కి ఎంపికైనట్లు తెలిపారు.

సీసీఆర్‌సీ గుర్తింపు కార్డులతో ప్రయోజనం


చీరాలలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకరరావు


మార్టూరులో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు

వేటపాలెం: కౌలుకు భూమి సాగు చేసుకొనే రైతులు కౌలు రైతు ధ్రువీకరణ పత్రాలు (సీసీఆర్‌సీ) కార్డులు పొందడం వల్ల వారికి అనేక ప్రయోజనాలు చేకూరతాయని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పల్లపో లు శ్రీనివాసరావు సూచించారు. మండలం పరిధిలోని అక్కాయిపాలెం, చల్లారెడ్డిపాలెం రైతు భరోసా కేంద్రాల వద్ద జగనన్న సురక్ష పథకాల్లో భాగంగా సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఆర్‌బీకే చైర్మన్ మాట్లాడుతూ కౌలు కార్డులు తీసుకో వడం ద్వారా పంట నమోదు, ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు కౌలు రైతులకు ఉపయోగపతుందని తెలిపారు. జగనన్న సురక్షా పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఐ ఐ కాశీవిశ్వనాథ్, పంచాయతీ సెక్రటరీ పూర్ణకుమారి, వీఏఏ స్వాతి, లక్ష్మి, సాయిజ్యోతి, ఐ స్వాతి, పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు..

మార్టూరు: రైతులు, కౌలు రైతులను గుర్తించి కార్డులు మంజూరు చేయటం కోసం నేటి నుంచి ప్రతి రైతు భరోసా కేంద్ర పరిధిలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు అన్నారు.


బల్లికురవలో మాటాడుతున్న ఏవో కుమారి

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వీఆర్వోలు, ఆర్బీకే సిబ్బందికి సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో ముందుగా కౌలు రైతులను గుర్తించి వారు ఎవరి భూములు సాగు చేస్తున్నారో తెలుసుకొని కౌలు రైతు కార్డులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. తహసీల్దార్ వెంకటరెడ్డి మాట్లాడుతూ కౌలు రైతు కార్డు కాలపరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందని భూ యజమానులు భయడాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఏవో కిరణ్ కుమార్, వీఆర్వోలు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: ప్రభుత్వం గ్రామాలవారీగా అర్హులైన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందజేస్తుందని ఏవో ఎస్‌వీపీ కుమారి తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వీఆర్వోలు, వీఏఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం నుంచి ఈ నెల 30 వరకు కౌలు రైతుల గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీటీ రవికుమార్ మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం ద్వారా భూయజమానులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు.

చీరాల: ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న దృష్ట్యా చీరాల ప్రాంతంలో ఉన్న కౌలు రైతులందరికీ కౌలు రైతు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని తహసీల్దార్ జే. ప్రభాకరరావు ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వీఏఏలతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అర్హులైన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆదేశించిందన్నారు. వెంటనే ఈ ప్రక్రియను ప్రారంభించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో వ్యవసాయశాఖాధికారి సుమతి, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏసీసీ చైర్మన్ బోయిన కేశవులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

లోఓల్టేజ్ సమస్య పరిష్కరించాలి


విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం, అధికారులు

● విద్యుత్‌శాఖ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

చీరాల: పట్టణంలో అనేక ప్రాంతాల్లో ఉన్న లోఓల్టేజ్ సమస్యపై విద్యుత్‌శాఖ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలో అధికంగా ఉన్న లోఓల్టేజ్ సమస్య ఎదుర్కొంటున్న వేసవిలో కరెంటు కోతలకు గురవుతున్న 31, 32, 33 వార్డులలో ఆయన పర్యటించారు. స్థానిక ప్రజలను అడిగి విద్యుత్ సరఫరా ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. నిత్యం ఈ వార్డుల్లో విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందని ప్రజలు తెలిపారు. విద్యుత్ అధికారులతో చర్చించిన ఆయన కొత్త కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు త్వరితగతిన ఏర్పాటు చేసి లోఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ఎలక్ట్రికల్ డీఈ సూర్యప్రకాశరావు, ఏడీఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, డీఈ ఏసయ్య, కౌన్సిలర్లు గొట్టిపాటి ఎబినేజర్, బత్తుల అనిల్, నాయకులు ఎస్.అనిల్, శివకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి


అధికారులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

● నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి

పర్చూరు (చినగంజాం): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే సమస్యలుండవని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని నాగులపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామానికి విచ్చేసిన ఆయనకు ప్రజలు పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రభుత్వ పథకాలు గురించి ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య నిర్వాహణ సక్రమంగా లేకపోవడంపై అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్యలను పిలిచి డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్సీ కాలనీలో దివ్యాంగుడు కట్టెంపూడి తేజకు త్వరలో మూడు చక్రాల వాహనాన్ని అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోట హరిప్రసాద్, మండల కో ఆర్డినేటర్ ముప్పాళ్ల రాఘవ, కోడూరి శివ, ఒగ్గిశెట్టి ప్రసాద్, కొల్లా రామకృష్ణ, కూరగాయల బుక్కయ్య, ఉప్పుటూరు సర్పంచ్ తిరుమలేశ్వరరావు, పర్చూరు ఉపసర్పంచ్ గాదె సురేష్, తులసీ రాజా, ఆకుల హేమంత్, అంకమ్మరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలి


ఎంపీడీవోను కలిసి జాయినింగ్ ఆర్డర్ అందజేస్తున్న రమేష్‌బాబు


చీరాల: ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన సుధారాణి


ఎంఈవోలను ఘనంగా సత్కరిస్తున్న యూటీఎఫ్ కారంచేడు శాఖ

● పలువురు ఎంఈవోల బాధ్యతల స్వీకరణ

బల్లికురవ: బల్లికురవ ఎంఈవో-2గా కాకాని రమేష్‌బాబు సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన ఎంఈవోను యూటీఎఫ్ నేతలు డీ. శేషగిరి, సీ వీరాంజనేయులు, సీహెచ్ అచ్యుత మోహన్, ఏ శ్రీనివాసరావు, పీ రామాంజనేయులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

చీరాల మండల ఎంఈవోగా సుధారాణి..

చీరాల అర్బన్: మండల ఎంఈవోగా పీ సుధారాణి సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పర్చూరు మండల ఎంఈవోగా పనిచేసిన నాగేశ్వరరావు చీరాలకు కూడా ఇన్‌చార్జిగా వ్యవహరించారు. చిన్నగంజాం మండలం కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న ఆమె బదిలీపై చీరాలకు వచ్చారు.

కారంచేడు ఎంఈవో-1గా సత్యన్నారాయణ


కారంచేడు-2 ఎంఈవో ఎం వెంకటేశ్వర్లు


వెంకటరామయ్య, పర్చూరు, ఎంఈఓ-2


వీరాంజనేయులు, ఎంఈవో-2, పంగులూరు

కారంచేడు: కారంచేడు ఎంఈవో-1 ఎంవీ సత్యన్నారాయణ బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు జరిగిన ఎంఈఓల కౌన్సిలింగ్‌లో మరలా కారంచేడు-1 వచ్చారు. అలాగే కారంచేడు-2 ఎంఈవో కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన మొలబంటి వెంకటేశ్వర్లు చెరుకూరు ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. వీరు సోమవారం బాధ్యతలు తీసుకోగా వారిని యూటీఎఫ్ కారంచేడు శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌రెడ్డి, పావులూరి శ్రీనివాసరావు, స్టేట్ కౌన్సిల్ నుంచి భవనం శ్రీనివాసరెడ్డి, రావి పద్మావతి, నాగమణి, భవానీప్రసాద్, మండల నాయకులు పారి కోటేశ్వరరావు, హుస్సేన్‌సాహెబ్,ఐం శ్రీనివాసరావులు ఘనంగా సత్కరించారు.

పర్చూరు ఎంఈవోగా వెంకటరామయ్య

పర్చూరు (చినగంజాం): మండల విద్యాశాఖాధికారి-2 గా పందలనేని వెంకట రామయ్య నియమితులయ్యారు. సోమవారం ఆయన ఎంఈఓకార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన మద్దిపాడు మండలం లింగంగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

రెండో ఎంఈఓగా వీరాంజనేయులు

జే.పంగులూరు: మండలానికి రెండో ఎంఈవో గోగుల వీరాంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. వీరాంజనేయులు గతంలో కొండమంజులూరు ఉన్నత పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వర్తించి, ప్రమోషన్‌పై పంగులూరు ఎంఈవోగా బాధ్యతలు తీసుకున్నారు.

పథకాల అమలులో దేశంలోనే ఏపీ టాప్


మహిళలతో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

● ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

మేదరమెట్ల: సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఏపీ అగ్రగామిగా నిలిచిందని.. ఇందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి చూపించిన చొరవే అని ఏపీ శాప్‌నెట్ చైర్మన్, నియోజకర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తిమ్మనపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఆయనకు పూలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఇంకా ఎవరైనా పథకాలు అందకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ లబ్ధి పొందిన బుక్‌లెట్‌ను ఆయన అందించారు. ప్రతిపక్షాలు ఎన్ని అసత్య ఆరోపణలు చేసినా ప్రజలు చంద్రబాబును నమ్మే స్థితిలో లేరని విమర్శించారు. మరలా మరలా జగనన్నను సీఎం చేసి అండగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, ఎంపీడీఓ సురేషబాబు, సర్పంచ్ లక్ష్మీకుమారి, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరిస్తూ.. భరోసా కల్పిస్తూ


లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న వెంకటేష్

● గడప గడపలో నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: ఇంటింటికి వెళ్లి సమస్యను వింటూ పరిష్కార మార్గాన్ని చూపించి భరోసా కల్పిస్తూ ముందుకు సాగింది గడప గపడకు మన ప్రభుత్వం. సోమవారం చీరాల పట్టణంలోని హయ్యర్‌పేటలో వార్డు సచివాలయం పరిధిలో కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. గ్రామంలోని వార్డుల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు సమస్యలేమైనా ఉంటే వాటిని కూడా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, వాసిమళ్ల వాసు, శ్రీను, కొణిదల బుజ్జి, కట్టా చంద్ర, చుక్కా నాగలక్ష్మి, మించాల సాంబశివరావు, మల్లెల లలిత రాజశేఖర్, గోలి స్వాతి, షేక్ కబీర్, గోలి రవి, దాసరి రామకృష్ణ, మల్లి రామకృష్ణ, కోలా శివ, కె.ప్రసాద్‌రెడ్డి, రమేష్, గోలి గంగాధర్, డొక్కా ప్రవీణ్, అన్నం సతీష్, తేళ్ల రాంబాబు, నాదెండ్ల కోటేశ్వరరావు, సిద్ధు, షేక్ మస్తాన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయమందిస్తున్న సభ్యులు, గ్రామపెద్దలు

చినగంజాం: గ్రామంలో వివిధ కారణాలతో మృతి చెందిన పలు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీ మూలగాని వారిపాలెంలో ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు అందించారు. గ్రామానికి చెందిన తెడ్డు సాంబిరెడ్డి మృతి చెందగా ఆయన భార్య రమాదేవికి రూ.10 వేలు నగదు, కావూరి పోలిరెడ్డి మృతి చెందగా ఆయన భార్య భాగ్యలక్ష్మికి రూ.10 వేలు, పల్లెబోయిన కోటిరెడ్డి మృతి చెందగా ఆయన భార్య ఆదిలక్ష్మికి రూ.10 వేలు, సోమవారం రాజు చినవెంకటేశ్వరరెడ్డి మృతి చెందగా వారి కుటుంబంలోని కుమారుడు శివారెడ్డికి రూ.10 వేలు అందించి ఆదుకున్నారు. గ్రామ పెద్దల సమక్షంలో ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు నగదును బాధిత కుటుంబాలకు స్వయంగా అందజేశారు. దీంతో వారందరూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆణిముత్యాలే ఆదర్శం

అద్దంకి: పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు మిగిలిన విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని చదవాలని హెచ్ఎం శ్రీనివాసమూర్తి అన్నారు. పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన హేమంత్, ద్వితీయ స్థానంలో నిలిచిన జీవీ మణికంఠ, తృతీయ స్థానంలో నిలిచిన తన్నీరు మంజులను విద్యా కమిటీ చైర్మన్ పీ శాంతి, ఎంపీటీసీ సభ్యురాలు కామేపల్లి నాగేంద్రమ్మ ప్రశంస పత్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

సీఎం జగన్ వల్లే విద్యావ్యవస్థలో పెనుమార్పులు

బల్లికురవ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ విద్యావ్యవస్థలో గత నాలుగేళ్లగా మార్పులు చేశారని బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య అన్నారు. జగనన్న ఆణిముత్యాల్లో భాగంగా సోమవారం బల్లికురవ ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రశంస పత్రాలతో సత్కరించారు. ఈ సందర్భంలో పేరయ్య మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతులు, విద్యా కానుక కిట్లు డిజిటల్ క్లాసులు, గోరుముద్ద, అమ్మఒడితో ప్రభుత్వ పాఠశాలలోని సాధారణ విద్యార్థులతో ఊహించని విధంగా ఆసాధారణ ఫలితాలు సాధించేలా చేశారని సీఎంను కొనియాడారు. అత్యధిక మార్కులు సాధించిన ఎన్ అపర్ణ, జే జేస్సికా, టి హేరామ్‌లు వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000 పారితోషికంతోపాటు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, కోఆప్షన్ సభ్యుడు షేక్ శ్రీనువలి, పీఎంసీ చైర్మన్ ఎన్ శ్రీనివాసులు, పాఠశాల హెచ్ఎం కె. హనుమంతరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బల్లికురవలో నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి


మాట్లాడుతున్న హెచ్ఎం రాణి

వేటపాలెం: బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు పునాదుల వేయాలని హెచ్ఎం భవనం రాణి పేర్కొన్నారు. మండల పరిధిలోని కఠారివారిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లిదండ్రులకు అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారన్నారు. ఇంగ్లిషు మీడియం విద్యను అమలు చేస్తుందని తెలిపారు. అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, యూనిఫారం, బ్యాగులు వంటి అనేక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. అనంతరం అదే స్కూల్‌లో 8వ తరగతి వరకు పూర్తిచేసిన విద్యార్థులు దగ్గరలోని అక్కాయిపాలెం పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బి బద్రిరెడ్డి, ఉపాధ్యాయులు కట్టా సుబ్బారావు, గోవాడ అజయ్‌బాబు, ఎం షీలాదేవి, కె రవీంద్రబాబు, ఎస్‌కే నబీ రసూల్, జీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పర్చూరు తహసీల్దార్‌గా సంధ్యశ్రీ



పర్చూరు (చినగంజాం): పర్చూరు మండల తహసీల్దార్‌గా కోటంరాజు సంధ్యశ్రీ నియమితులయ్యారు. ఈమె సోమవారం పర్చూరు తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. వేటపాలెం తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు ఆమె తెలిపారు. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన నెహ్రూబాబు బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అవ్వడంతో ఏర్పడిన ఖాళీలో ఆమె వచ్చి చేరారు.